




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

గురువారం 21-8-2025

సంపుటి: 21 సంచిక: 128
పేజీలు: 8 వెల: రూ.1




# ఏపీసీ చెలగాటం..
# ఎమ్మెల్యేకు ఇరకాటం!




- సెలవుల్లో సౌమ్యపై వేటు.. శశిభూషణ్ నిర్వాకంతో చేటు!
- ప్రిన్సిపాల్ కేసులో కూన రాజకీయాన్ని ఫణంగా పెట్టిన ఏపీసీ
- విచారణ జరిపించినట్లు తప్పుదారి పట్టించి సొంత నిర్ణయాలు
- ఎస్పీడీ, జిల్లా కోఆర్డినేటర్ దృష్టిలో పెట్టకుండా నేరుగా కలెక్టర్‌కే ఫైలు
- వ్యతిరేకుల కుట్రలో ఆయన భాగమయ్యారా అన్న అనుమానాలు

> " కళ్ల ముందు కనిపిస్తున్న ఆధారాల మేరకు సమగ్రశిక్ష ఏపీసీ శశిభూషణ్ స్వామిభక్తి, అత్యుత్సాహం వల్ల పొందూరు కేజీబీవీ విషయంలో కూన రవికుమార్ ఒకటికి పదిసార్లు సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. "

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అమెరికా సంయుక్త రాష్ట్రాల పర్యటన ముగించుకుని శ్రీకాకుళం వస్తున్న సందర్భంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు భారీ స్వాగత ఏర్పాట్లు జరిగాయి. విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి ఆమదాలవలస వరకు రహదారులన్నింటినీ స్వాగత ఫ్లెక్సీలతో ఆయన అభిమానులు, పార్టీ శ్రేణులు నింపేశారు. దాంతో ఏదో జరుగుతోందన్న చర్చ రేగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమెరికా వెళ్లడం రవికి ఇది రెండోసారి. కానీ మొదటిసారి లేనంతగా రెండోసారి పెద్ద ఎత్తున స్వాగత ఏర్పాట్లు జరిగాయంటే.. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో చోటు లభిస్తుందేమోనన్న టాక్ కూడా నడిచింది. సీన్ కట్ చేస్తే.. రవికుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ రోడ్డుకెక్కారు. ఆ కథ ఎన్ని మలుపులు తీసుకుందో పాఠకులకు తెలుసు. బంగారం లాంటి అవకాశాన్ని జిల్లాలో సొంత పార్టీ నేతలే కుట్ర చేసి చెడగొట్టారని రవి అభిమానులు భావిస్తుంటే.. వైకాపా నేతలే ఓ పథకం ప్రకారం తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని కూన రవికుమార్ ఆరోపించారు. ఈ రెండింట్లో ఏది వాస్తవమనేది కాసేపు పక్కన పెడితే కళ్ల ముందు కనిపిస్తున్న ఆధారాల మేరకు సమగ్రశిక్ష ఏపీసీ శశిభూషణ్ స్వామిభక్తి,

> " ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై సొంత పార్టీ నేతలు లేదా ప్రతిపక్షం కుట్ర పన్నిందా? అన్న విషయం పక్కన పెడితే.. వారితో ఏపీసీ కుమ్మక్కయ్యారా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. "

అత్యుత్సాహం వల్ల పొందూరు కేజీబీవీ విషయంలో కూన రవికుమార్ ఒకటికి పదిసార్లు సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### సెలవుల్లో అంత అవసరమా?

ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై సొంత పార్టీ నేతలు లేదా ప్రతిపక్షం కుట్ర పన్నిందా? అన్న విషయం పక్కన పెడితే.. వారితో ఏపీసీ కుమ్మక్కయ్యారా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఎందుకంటే.. పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్‌పై ఆరోపణలు వచ్చాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరిన మరుక్షణమే ఏపీసీ ఆగమేఘాల మీద కలెక్టర్ ముందు ఫైలు పెట్టి బదిలీ చేయించారు. విడ్డూరమేంటంటే.. శుక్ర, శని, ఆదివారాలు మూడు రోజులూ ప్రభుత్వ కార్యాలయాలకు వరుస సెలవులు వచ్చాయి. ఆ సెలవుల్లోనే మధ్యరోజు ప్రిన్సిపాల్ సౌమ్యను బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. సెలవు రోజు బదిలీ చేయాల్సిన అవసరం ఏమిటనేది ఏపీసీకి చెప్పకపోయినా దాని ప్రభావం ఎమ్మెల్యే కూనపై పడింది. వాస్తవానికి ప్రిన్సిపాళ్ల నియామక అధికారం సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఎస్పీడీ) చేతిలో ఉంటుంది. అలాంటప్పుడు ఒక ప్రిన్సిపాల్‌ను అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్‌లో బదిలీ చేయాల్సి వస్తే ఆ విషయాన్ని ఎస్పీడీ దృష్టిలో పెట్టాలి. ఏపీసీ శశిభూషణ్ అలా కాకుండా నేరుగా కలెక్టర్‌కు ఫైల్ పెట్టి బదిలీ ఉత్తర్వులిచ్చేశారు.

### ఎమ్మెల్యేకు తప్పుడు సమాచారం

అక్కడితో ఆగకుండా సౌమ్య ఆరోపణలు చేసిన నేపథ్యంలో జిల్లాలో ఏం జరుగుతోందని ఏపీసీకి ఫోను చేసి కూన రవి ఆరా తీసినప్పుడు అవాస్తవాలు చెప్పి ఆయన్ను తప్పుదోవ పట్టించారు. ఇక్కడే రవికుమార్ ఇరుక్కున్నారు. ప్రిన్సిపాల్ సౌమ్యపై వచ్చిన ఆరోపణలపై ఆర్‌జేడీతో విచారణ జరిపించామని, వాస్తవాలని తేలిన తర్వాత కంచిలికి బదిలీ చేశామని

> " నిజంగా ఆర్‌జేడీ విచారణ జరిపి ఉంటే.. కలెక్టర్ ఈ వ్యవహారంపై మళ్లీ విచారణకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను ఎందుకు నియమిస్తారనే దానికి ఏపీసీ సమాధానం చెప్పాల్సి ఉంటుంది. "

> " సెలవు రోజు బదిలీ చేయాల్సిన అవసరం ఏమిటనేది ఏపీసీ చెప్పకపోయినా దాని ప్రభావం ఎమ్మెల్యే కూనపై పడింది.
> ఒక ప్రిన్సిపాల్‌ను అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్‌లో బదిలీ చేయాల్సి వస్తే ఆ విషయాన్ని ఎస్పీడీ దృష్టిలో పెట్టాలి. ఏపీసీ శశిభూషణ్ అలా కాకుండా నేరుగా కలెక్టర్‌కు ఫైల్ పెట్టి బదిలీ ఉత్తర్వులిచ్చేశారు. "

శశిభూషణ్ తప్పుడు సమాచారం ఇచ్చారు. దాన్ని నమ్మిన రవికుమార్ విశాఖపట్నం ఎయిర్ పోర్టులో దిగిన వెంటనే విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆర్‌జేడీ ఎంక్వైరీ చేశారని, ఆమెపై ఆరోపణలు వాస్తవమని తేలిందని చెప్పుకొచ్చారు. కానీ ఇక్కడ జరిగింది మాత్రం వేరు. సౌమ్యకు బదిలీ ఉత్తర్వులు ఇవ్వడం, దానిపై గొడవ ముదిరిన తర్వాతే ఆర్‌జేడీ విచారణకు వచ్చారు. ఆయన ఏమేరకు నివేదిక ఇచ్చారో తెలియదు. ఇప్పుడు ఈ గందరగోళంలో అందరి పాత్ర ఉండటంతో బహుశా బ్యాక్‌డేట్ వేసి నివేదికలు ఇచ్చినా ఆశ్చర్యపోనవసరంలేదు. దీనివల్ల ఏపీసీ తప్పించుకోవచ్చు. కానీ - మిగతా చివరి పేజీలో




- గంటల తరబడి క్యూలో ఉంటేనే టోకెన్
- అభా యాప్‌లో నమోదైతేనే చీటీ
- పరీక్షలు ఒకరోజు.. రిపోర్టులు మరో రోజు
- పేషెంట్లు పెరుగుతున్నా పెరగని కౌంటర్లు

# రిమ్స్‌లో ఓపీ.. రోగం కంటే నరకం!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రిమ్స్‌లో వైద్యం కోసం వచ్చే రోగులకు ఓపీ కష్టాలు వెంటాడుతున్నాయి. ఓపీ కోసం గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండాల్సిన పరిస్థితి రావడం వల్ల వైద్యుడిని కలవడానికి ఒక రోజు, వైద్య, రక్త పరీక్షలు చేయించి వాటి రిపోర్టులను చూపించడానికి మరుసటి రోజు రావాల్సి వస్తుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే ఓపీలో వైద్యులు అందుబాటులో ఉంటారు. ఆ తర్వాత రోగుల రద్దీని బట్టి కొన్ని విభాగాల్లో వైద్యులు ఉంటారు. వైద్యుడు భౌతికంగా పరీక్షించి, వైద్యపరీక్షలకు సూచిస్తే రెండోరోజు రిపోర్టులు పట్టుకొని రావాల్సి ఉంటుంది. రోగి ఓపీ తీసుకోవడానికి ఆధార్, సెల్‌ఫోన్ తప్పనిసరి చేశారు. రోగి ఓపీ తీసుకోవడానికి ముందు టోకెన్ తీసుకోవాలి. ఆ టోకెన్ ఆధారంగా క్యూలో నిల్చొని కౌంటర్‌లో ఓపీ తీసుకోవాలి. టోకెన్ కోసం ఓపీ వద్ద ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్‌లో రోగి వివరాలను నేషనల్ హెల్త్‌మిషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న అభా యాప్‌లో నమోదు చేయాలి. నమోదు కోసం రోగి ఫోన్ నెంబర్‌తో పాటు, ఆధార్‌ను ఎంటర్ చేయాలి. రోగి ఫోన్ నెంబర్‌కు ఓటీపీ పంపించి దాన్ని అభా యాప్‌లో నమోదు చేస్తే టోకెన్ జనరేట్ అవుతుంది. ఓటీపీ వచ్చిన వరకు వేచి ఉండాలి. ఓటీపీ రాకుంటే టోకెన్ రాదు. ఒకవేళ సొంత ఫోన్ లేకపోతే హెల్ప్‌డెస్క్ వద్ద ఉన్న సిబ్బంది ఫోన్‌తో ఓటీపీ జనరేట్ చేస్తున్నారు. దీనికి రోగి ఆధార్ తప్పనిసరి. ఫోన్, ఆధార్ లేకపోతే రిమ్స్‌లో వైద్యం చేసుకోవడానికి అనుమతి లేదు. ఈ నిబంధనలను నేషనల్ మెడికల్ కౌన్సిల్ (కేంద్రం) తీసుకువచ్చింది.

రోగులకు ఎదురువుతున్న ఇబ్బందులపై రిమ్స్ అధికారులు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం చూపించలేకపోతున్నారు. దీనికి కారణం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కావడంతో వైద్య కళాశాలలో పీజీ కోర్సుల మంజూరుకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ అభా యాప్‌లో రోగుల వివరాలు నమోదు తప్పనిసరి చేసింది. రోగులకు ఓపీ ఇబ్బందుల నుంచి బయటపడడానికి మార్గం ఉన్నా నిధులు లేమి కారణంగా రిమ్స్ అధికారులు మిన్నకుంటున్నారు. రిమ్స్ అభివృద్ధి కమిటీ అకౌంట్‌లో నిధుల లేమి కారణంగా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడానికి వీలుకావడం లేదని అధికారులు చెబుతున్నారు. రిమ్స్ ఓపీ కౌంటర్‌లో ప్రస్తుతం ఎనిమిది మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు మాత్రమే ఉన్నారు. రోజు రిమ్స్‌కు వచ్చే రోగుల సంఖ్య అంతకంతకూ పెరుగుతుంది. సీజన్‌లో ఈ సంఖ్య రోజుకు 1200 దాటుతుంది. సాధారణ సమయంలో ఈ సంఖ్య 800కు తగ్గడం లేదు. వీరందరికీ కొన్ని నిమిషాల సమయంలో ఓపీ చీటి ఇవ్వడానికి డేటా ఎంట్రీ ఆపరేటర్ల సంఖ్య 20కు పెంచాలని ఒక సూచన ఉంది. అయితే కొత్తగా డేటా ఎంట్రీ ఆపరేటర్లను విధుల్లోకి తీసుకుంటే వారికి నెలకు కనీసం రూ.15 వేలు చెల్లించాలి. ఈ మొత్తం చెల్లించే ఆర్థిక వనరులు రిమ్స్ వద్ద అందుబాటులో లేవు. ప్రభుత్వం దీన్ని మంజూరు చేయదు. దీంతో అదనపు సిబ్బంది నియామకంపై సందిగ్ధత నడుస్తుంది. సిబ్బందితో పాటు కంప్యూటర్లు, ప్రింటర్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు ఇంటర్నెట్ సౌకర్యం మెరుగుపర్చాల్సి ఉంటుంది. ప్రస్తుతం రిమ్స్‌లో ఇంటర్నెట్ సేవలు అంతంత మాత్రమే. ఇంటర్నెట్ సేవలు మెరుగుపర్చాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.



ఓపీలో రోగులకు ఎదురవుతున్న సమస్యను కలెక్టర్ రెండుసార్లు స్వయంగా పరిశీలించి ఉన్నతస్థాయి అధికారులతో మాట్లాడినా పరిష్కారం దొరకలేదు. అదనపు సిబ్బందిని నియమిస్తే వేతనాలు సకాలంలో ఇవ్వకపోతే కొత్త సమస్య ఎదురవుతుందని గ్రహించి ఆపరేటర్ల విషయంలో కలెక్టర్ వెనక్కితగ్గారు. ఓపీలో రోగుల గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడకుండా చేయడానికి ఆపరేటర్ల నియామకమే ప్రత్యామ్నాయం. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాలు తప్పనిసరిగా అమలుచేయాలి కాబట్టి రోగులకు ఇబ్బందులు ఎదురైనా క్యూలైన్‌లో ఉండి ఓపీ తీసుకోవాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. ఓపీ విభాగం వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ల వద్ద ఉన్న సిబ్బంది అందరూ వారి వద్ద ఉన్న సొంత ఫోన్‌లో అభా యాప్‌తో ఓటీపీలను జనరేట్ చేస్తున్నారు. ఓటీపీ జనరేట్ కానప్పుడు మాత్రం రోగులు అసహనం ప్రదర్శిస్తున్నారు. ఫోన్‌లో ఓటీపీ జనరేట్ చేసి టోకెన్ చేతిలో పెట్టిన తర్వాత ఓపీ చీటి కోసం గంటపాటు నిలబడాల్సి వస్తుంది. మెరుగైన ఇంటర్నెట్ సేవలు అందిస్తే తప్పా ఓపీ విభాగంలో ఓపీ చీటీలు జనరేట్ చేయడం ఇబ్బందిగా ఉందని డేటా ఎంట్రీ ఆపరేటర్లు చెబుతున్నారు. మధ్యాహ్నం 12 గంటలు తర్వాత వైద్యులు అందుబాటు ఉండరని, గంటలు తరబడి క్యూలో నిలబెడుతున్నారని రోగులు సిబ్బందితో గొడవకు దిగుతున్నారు. క్యూలైన్‌లో రోగులు తరుచూ ఘర్షణ పడుతున్నారు. దీన్ని స్ట్రీమ్‌లైన్ చేయడానికి ప్రత్యామ్నాయం ఆలోచించి అదనంగా డేటా ఎంట్రీ ఆపరేటర్లను, కంప్యూటర్, ప్రింటర్లను, ఇంటర్నెట్ సేవలను మెరుగుపర్చాలని రోగులు, వారి సహాయకులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.



• ఎడిటోరియల్

# ఆ సవరణ.. ప్రజాస్వామ్యానికి మరణ శాసనం!

ఏ పదవిలో ఉన్నవారైనా సరే.. ఏదైనా కేసులో ఏకధాటిగా 30 రోజులు పోలీసు కస్టడీలో ఉంటే ఆటోమేటిక్‌గా వారి పదవి రద్దయిపోతుంది. ఈ మేరకు రాజ్యాంగ సవరణ బిల్లును మోదీ సర్కారు నిన్న పార్లమెంటులో ప్రవేశపెట్టింది. చెప్పుకోవడానికి ఇది బాగానే ఉంటుంది. రాజకీయ అవినీతిని నియంత్రించేందుకు ఉపకరిస్తుందని అనిపించవచ్చు. పాలక బీజేపీ, ఎన్డీయే కూటమి సర్కారు కూడా అదే చెబుతున్నాయి. కానీ యావత్తు ప్రతిపక్షం దీన్నో దుర్మార్గపు, నియంతృత్వ ప్రతిపాదనగా అభివర్ణిస్తూ.. తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ప్రతిపక్షాన్ని అణగదొక్కేందుకు ఏకంగా ప్రజాసామ్యానికే మరణ శాసనం రాస్తున్నారని విమర్శిస్తున్నాయి. ఇంతకూ సదరు సవరణ బిల్లులో ఏముంది? దాని వల్ల తలెత్తే ఉత్పాతాలు ఏ స్థాయిలో ఉంటాయో ఒకసారి పరిశీలిద్దాం. బుధవారం లోక్‌సభలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా 130వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టిన ఉత్తర క్షణమే సభలో తీవ్ర గందరగోళం చెలరేగింది. సభ మొత్తం ప్రతిపక్షాల ఆగ్రహావేశాలతో ఊగిపోయింది. రాజ్యాంగంలోని 75, 164, 239ఏఏ అధికరణలకు సవరణలు చేస్తూ ప్రతిపాదించిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లులో తీవ్ర నేరారోపణలతో అరెస్టయిన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల సహా కేంద్ర, రాష్ట్ర మంత్రులు వరుసగా 30 రోజులు కస్టడీలో ఉంటే వారి పదవి దానంతట అదే రద్దవుతుందన్నది ఈ సవరణ సారాంశం. ఐదేళ్లు, అంతకంటే ఎక్కువ శిక్ష పడే అవకాశం ఉన్న కేసులకు ఇది వర్తిస్తుందని ప్రభుత్వం ప్రతిపాదించింది. అవినీతిపై పోరాటంలో ఒక కీలక ముందడుగుగా కేంద్రం చెప్పుకొంటోంది. తీవ్రమైన ఆరోపణలతో జైల్లో ఉన్న నేతలు పదవుల్లో కొనసాగడం అనైతికమంటూ ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ వంటి వారి ఉదంతాలను ప్రస్తావిస్తోంది. ప్రస్తుత చట్టాల ప్రకారం ఒక ప్రజాప్రతినిధిపై నేరం రుజువై.. రెండేళ్లకు పైగా శిక్ష పడితేనే వారిపై అనర్హత వేటు పడుతుంది. కానీ కొత్త రాజ్యాంగ సవరణ బిల్లు నేరం రుజువు కాకముందే అరెస్ట్ ఆధారంగా పదవి నుంచి తొలగించాలని ప్రతిపాదిస్తోంది. ఇది న్యాయవ్యవస్థ చేతిలో ఉన్న అధికారాన్ని కార్యనిర్వాహకవర్గం లాక్కోవడమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. సహజ న్యాయసూత్రాలకు ఇది పూర్తిగా విరుద్ధం కూడా. నేరం నిరూపితం కాకుండా నిందితులను దోషిగా పరిగణించరాదని మన రాజ్యాంగం, చట్టాలు ఘోషిస్తున్నాయి. కానీ కొత్త సవరణ వల్ల కీలకమైన రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారినే విచారణ జరగకముందే, దోషిగా తేలకముందే పదవుల నుంచి ఊస్ట్ చేయడమంటే.. శిక్షించినట్లే లెక్క. దీన్ని న్యాయవ్యవస్థ అసలు అంగీకరించదు. న్యాయపరమైన అభ్యంతరాలు ఇలా ఉంటే.. ఈ సవరణ గనుక అందుబాటులోకి వస్తే ప్రతిపక్షాలపై కక్ష సాధింపులకు అధికార పక్షం చేతికి ఆయుధం ఇచ్చినట్లేనని రాజకీయ పక్షాలు వ్యాఖ్యనిస్తున్నాయి. ఈ బిల్లుతో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని ఇది సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టని విమర్శిస్తున్నాయి. దీన్ని అడ్డం పెట్టుకొని కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేసి ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చే కుట్రలకు తెర లేపుతారని ఆరోపిస్తున్నారు. ఈ భయాందోళనల్లో వాస్తవం లేకపోలేదు. గత కొన్నేళ్లుగా ఈడీ, సీబీఐ వంటి కేంద్ర సంస్థలు ప్రతిపక్ష నేతలనే టార్గెట్ చేస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం ఆరోపణలపైనే రాజకీయ నేతలను విచారణ పేరుతో నెలల తరబడి జైళ్లలో ఉంచుతున్న ఉదంతాలను ప్రతిపక్షాలు ప్రస్తావిస్తున్నాయి. 130వ సవరణతో ఆ దుర్మార్గపు ప్రక్రియకు రాజ్యాంగబద్ధత కల్పించడమే అవుతుందన్నది ప్రతిపక్షాల ఆందోళన. తమకు ఇష్టం లేని ఏ ముఖ్యమంత్రి పైనైనా తప్పుడు కేసు పెట్టి.. 30 రోజులు జైల్లో ఉంచి, ఆనక పదవి నుంచి తొలగించే ప్రమాదం ఉందంటున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి అపరిమిత అధికారాలు ఉన్నాయి. ప్రపంచంలో ఎక్కడైనా కేసు వేసిన సంస్థే నిందితుడు తప్పు చేశాడని నిరూపించాలి. కానీ ఈడీ కేసు పెడితే మాత్రం కేసు ఎదుర్కొనేవారే తాము తప్పు చేయలేదని నిరూపించుకోవాలి. అలాగే ఈడీ కేసుల్లో బెయిల్ ఎన్ని రోజులైనా జైలులో ఉంచొచ్చు. 2014 నుంచి రాజకీయ నేతలపై ఈడీ పెట్టిన 193 కేసుల్లో నేరం నిరూపితమైనవి రెండంటే రెండు కేసులో. అంటే మిగతావన్నీ రాజకీయ వేధింపులకు ఉద్దేశించినవే. ఈ లెక్కన ఈడీ, కొత్త చట్టాన్ని కలిపి ప్రయోగిస్తే ఎవరినైనా కారణం లేకుండా 30 రోజులు రిమాండ్‌లో ఉంచి, పదవి లాగేయవచ్చన్నమాట. అందుకే ప్రతిపక్షాలు దీన్ని అంతగా వ్యతిరేకిస్తున్నాయి.

## ఆన్‌లైన్ క్రీడలు నిషేధం హర్షణీయం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎన్నో కోట్ల కుటుంబాలలో విషాదాన్ని నింపుతూ ఎందరో ఆత్మ హత్యలకు కారణమవుతున్న ఆన్‌లైన్ క్రీడలను నిషేధిస్తూ లోక్‌సభలో బిల్‌పాస్ కావడంతో హర్షదాయకమని శ్రీకాకుళం ఇంటాక్ అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథ్‌నాయుడు గురువారం వ్యాఖ్యానించారు. అన్ని దశలను అధిగమించి, ఈ బిల్లు త్వరలోనే చట్టంగా రావాలని కోట్ల కుటుంబాలు ఆత్రంగా ఎదురు చూస్తున్నారన్నారు. యువత సమయం, ధనం, ప్రాణాలను హరిస్తున్న ఈ ఆన్ లైన్ గేమ్స్ నిషేధ చట్టాన్ని అమలు చేయడానికి ముందుకొచ్చిన కేంద్ర ప్రభుత్వ చర్యలు అభినందనీయమని నాయుడు పేర్కొన్నారు.

## దివ్యాంగుల పెన్షన్లను తొలగించడం దారుణం

(సత్యంన్యూస్, పాతపట్నం)




కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగుల పింఛన్లలో కోత విధించడంపై వైకాపా రాష్ట్ర క్రమ శిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన భరోసా, మద్దతును గుర్తు చేస్తూ, ప్రస్తుత ప్రభుత్వ విధానాలపై ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు దివ్యాంగుల పింఛన్లలో కోత విధిస్తూ, వారి జీవితాలను అగమ్యగోచరంగా మార్చడం అమానవీయమన్నారు. దివ్యాంగుల పట్ల కూడా కూటమి ప్రభుత్వం రాజకీయాలు చేయడం దారుణమని మండిపడ్డారు. "ఇదేనా పాలన అంటే?" ప్రశ్నించారు. పింఛన్లను తొలగించడం ద్వారా దివ్యాంగులను నిరాధారులను చేసి, వారికి ఉన్న ఏకైక ఆధారాన్ని లాగేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం దివ్యాంగులకు ఎంతో అండగా నిలిచిందని, పింఛన్లను పెంచి గౌరవంగా బతికేలా చేసిందని గుర్తు చేశారు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. వైఎస్ జగన్ పాలనలో దివ్యాంగుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించారన్నారు. ఏ ఒక్కరి పింఛన్ తొలగించలేదన్నారు. కానీ, కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. 100శాతం వైకల్యం ఉన్న వారిని సైతం "రీ-వెరిఫికేషన్" పేరుతో వేధిస్తోందని, ప్రభుత్వాసుపత్రులకు పిలిపించి అమానుషంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఈ వెరిఫికేషన్ కేవలం పింఛన్లలో కోత కోసమే అని స్పష్టం చేశారు. వృద్ధుల పింఛన్లను కత్తిరించడానికి వెనుకాడటం లేదని, కొత్తవి ఇవ్వకపోగా ఉన్నవాటినే తొలగిస్తోందని ఆరోపించారు. కనీసం దివ్యాంగుల పట్ల కూడా దయ చూపడం లేదన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో సుమారు 66.34 లక్షల మందికిపైగా పింఛన్లు ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటివద్దే పారదర్శకంగా వలంటీర్ల ద్వారా అందించగా, టీడీపీ కూటమి ప్రభుత్వం ఇప్పుడు వీటిని కేవలం 62.19 లక్షలకే పరిమితం చేసిందన్నారు. ఏడాదిలో దాదాపు 4.5 లక్షల పింఛన్లను తొలగించింది. వృద్ధుల పింఛన్లు తొలగించి వారిని ఇబ్బందులకు గురి చేస్తున్న కూటమి ప్రభుత్వం, ఇప్పుడు దివ్యాంగుల పింఛన్లను కూడా విచక్షణారహితంగా తొలగిస్తోందన్నారు.

మళ్ళీ మళ్ళీ సదరం సర్టిఫికెట్లు తేవాలని, వైద్య పరీక్షలు, వైకల్య శాతం తగ్గింపు పేరుతో దివ్యాంగులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. 40శాతం కంటే తక్కువ వైకల్యం ఉందని, పింఛనుకు అనర్హులంటూ ప్రతి జిల్లాలో వేలాదిమంది లబ్ధిదారులకు నోటీసులు జారీ అవుతున్నాయన్నారు. ఎన్నో ఏళ్లుగా పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్న దివ్యాంగులను చంద్రబాబు కూటమి ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా రోడ్డుపాలు చేసిందని, పింఛనుదారులు దిక్కులేని స్థితిలో పడ్డారని, గగ్గోలు పెడుతున్నారన్నారు. రాష్ట్రంలోని దివ్యాంగుల జీవితాలపై ప్రభావం చూపే ఈ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, పింఛన్లను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దివ్యాంగుల పక్షాన తమ పార్టీ తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు.


## బకాయి వేతనాలు చెల్లించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రిమ్స్ అధికారులు వెంటనే స్పందించి సెక్యూరిటీ సిబ్బంది 2నెలల బకాయి వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు డిమాండ్ చేశారు. రిమ్స్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం రిమ్స్ హాస్పిటల్ సెక్యూరిటీ కార్మికుల 2నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, ఆకలితో అలమటిస్తున్న కార్మికుల సమస్యపై అధికారులు స్పందించాలని, కార్తికేయ సెక్యూరిటీ కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రిమ్స్ హాస్పిటల్ వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో 15ఏళ్ళుగా సెక్యూరిటీ గార్డులుగా సేవలందిస్తున్న వారికి 2025 జూన్, జూలై వేతనాలు నేటికి చెల్లించలేదని,కార్తికేయ సెక్యూరిటి ఏజెన్సీ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మికుల సమస్యల పరిష్కరించాల్సిన రిమ్స్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. పాత కాంట్రాక్టర్ ఏప్రిల్, మే ఏరియర్స్ చెల్లించవలసి ఉందన్నారు. కొత్త కాంట్రాక్టర్ బాధ్యతలు తీసుకుని రెండునెలలు పూర్తయినా ఇప్పటికీ కార్మికుల సమస్యలపై యూనియన్‌తో చర్చించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంపుదల చేయవలసిన అవసరం ఉందన్నారు. జూన్ జూలై జీతాలు చెల్లించకపోవడంతో కార్మిక కుటుంబాలు ఆకలి మంటలతో అలమటిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సెక్యూరిటీ సిబ్బందితో పని చేయించుకోవడానికి బాధ్యత తీసుకుంటున్న రిమ్స్ అధికారులు కార్మికుల వేతనాలకు బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధరలు ఆకాశాన్నంటుతుంటే అతితక్కువ వేతనాలతో సెక్యూరిటీ సిబ్బంది కుటుంబాలను నెట్టుకురావడం భారంగా ఉన్న నేపథ్యంలో ఇచ్చే వేతనాలు కూడా సకాలంలో ఇవ్వకపోతే కార్మికులు కుటుంబాలు ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. జిల్లా యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకొని కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రిమ్స్ యూనియన్ నాయకులు కె.రవి, సంతోషి, కృష్ణవేణి, ఎ.సూర్యనారాయణ, టి.రామారావు, బి.శ్రీను, జె.వెంకటరమణ, ఎస్.మురళి, హెచ్.లక్ష్మణరావు, ఎస్.రాజేంద్ర, జి.అప్పన్న, ఎం.శ్రీను, హైమారావు తదితరులు పాల్గొన్నారు.








**నెత్తురు**

**వస్తేనే విప్లవం కాదు నెత్తురు, అరుపులు లేకుండా కూడా నిశ్శబ్ద విప్లవాలను తీసుకుని రావచ్చు. అలాంటి నిశ్శబ్ద విప్లవ వీరుడు విశ్వనాథ్. మొగోడికో నీతి ఆడదానికో నీతా అని నిర్మలమ్మ పాత్ర చేత నిలేయిస్తాడు విశ్వనాథ్. భార్య చనిపోయాక మూడు నెలలకే రెండో పెళ్లి చేసుకున్న నువ్వటరా ప్రశ్నించేదని అల్లుడు సుత్తి వీరభద్రరావుని వాయిస్తుంది. సినిమా ఫోకస్ ఈ విధవా వివాహం మీద కాకపోయినా అంతర్లీనంగా ఈ విప్లవ భావాన్ని జొప్పించారు విశ్వనాథ్. సినిమా ఫోకస్ వయసు పెరిగినా బుద్ధి పెరగని ఒక అమాయకుడిని, స్వాతిముత్యాన్ని ఓ నిస్సహాయ విధవ అనూహ్య పరిస్థితుల్లో భార్య అయి ఎలా ప్రయోజకుడిని చేసుకుంటుంది అనే అంశం మీదనే. మా తరం వాళ్ళకు అక్కినేని, సావిత్రిలు నటించిన అర్ధాంగి సినిమా గుర్తుకొస్తుంది. కథానాయికలు అర్ధాంగులు కావటంలో చాలా వ్యత్యాసం ఉంది.**

# అన్నీ కలగలిసిన..
# ఆణిముత్యం!

1986 మార్చి 13న విడుదలయిన ఈ స్వాతిముత్యం సినిమా అనగానే ఎక్కువ మందికి కమల్ హాసన్, విశ్వనాధులే గుర్తుకొస్తారు. వారిద్దరికీ అవార్డులు కూడా వచ్చాయి. అంతే ధీటుగా, బహుశా ఇంకా గొప్పగా రాధిక నటించింది. ఆమెకు అవార్డు ఎందుకు రాలేదో నాకెప్పుడూ ఆశ్చర్యమే. అలాగే ఈ సినిమాలో అద్భుతమైన పాత్ర దీపది. ఆల్మోస్ట్ అన్ని సినిమాల్లో గ్లామరస్ రబ్బర్ బొమ్మగా చూపబడే దీపకు చాకలి పాత్రను ఇచ్చి, ఆ పాత్రలో దీప చేత గొప్ప నటనని రాబట్టారు విశ్వనాథ్. నిర్మలమ్మ. మనకున్న మహా నటీమణుల్లో ఒకరు ఆమె. ఆర్ద్రత, కరుణ, ప్రశ్నించే పాత్రల్లో ఆమెకు ఆమే సాటి. ఈ సినిమాలో కూడా గొప్ప నటనని అందించారు. ఇతర ప్రధాన పాత్రల్లో శరత్ బాబు, మేజర్ సుందరరాజన్, సుత్తి వీరభద్రరావు, డబ్బింగ్ జానకి, వరలక్ష్మి, అనిత, వైవిజయ, గొల్లపూడి మారుతీరావు, ఆలీ, సోమయాజులు, పొట్టి ప్రసాద్ నటించారు.

ఈ సినిమాలో మరో ముఖ్య పాత్ర రాధిక సినిమాలో కనిపించని మొదటి భర్త కొడుకు. పేరు కార్తీక్. ప్రముఖ నటుడు కాంతారావు మనమడు. అల్లు అర్జున్ కూడా మనమళ్ళలో ఒకడిగా తళుక్కుమంటాడు. కార్తీక్ కమల్‌హాసన్ దోస్తుగా చాలా బాగా నటించాడు.

నాకు బాగా ఇష్టమైన మరో పాట దీప, కమల్ హాసన్ల మీద సాగే పాట. ఆత్రేయ వ్రాసిన తాళి బొట్టు తెస్తానని తాళ్ళరేవుకెళ్ళిండు మామ. కమల్ హాసన్ని ఆ ఉరి జనమంతా పసిపిల్లవాడిగా ఎలా చూస్తారో దీప అతని చేత వీపు రుద్దించుకునే సీన్ తెలియచేస్తుంది. ఇంతటి శృంగార రస భరిత, సున్నితమైన సీన్లను సినిమాలో దూర్చటం విశ్వనాధుకి బాగా తెలుసు. ఈ సీన్ చూడగానే సాగర సంగమం సినిమాలో జయప్రద స్నాన సన్నివేశం గుర్తుకొస్తుంది రస హృదయులకు.

సువ్వీ సువ్వీ సువ్వాలమ్మ సీతాలమ్మా, చిన్నారి పొన్నారి కిట్టయ్యా నిన్నెవరు కొట్టారయ్యా పాటలు చాలా శ్రావ్యంగా ఉంటాయి. ముఖ్యంగా చిన్నారి పొన్నారి కిట్టయ్యా పాట చిత్రీకరించబడిన దేవాలయం అద్భుతంగా ఉంటుంది. ఎక్కడిదో ఈ దేవాలయం తెలియదు. ఈ సినిమాలో ఉన్న మరో పాట ధర్మం శరణం గఛ్చామి దానం శరణం గఛ్చామి అని దానాన్ని కూడా తగిలించారు ఆత్రేయ. తోటపల్లి సాయినాధ్, ఆకెళ్ళ వెంకట సూర్యనారాయణ చక్కటి సంభాషణలను అందించారు.

సినిమాకు కనకంతో పాటు, ప్రశంసలు, పురస్కారాలు కూడా వర్షించాయి. జాతీయ స్థాయిలో ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపికయింది. ఉత్తమ చిత్రంగా ఏడిద నాగేశ్వరరావుకు, ఉత్తమ నటుడిగా కమల్ హాసనుకి, ఉత్తమ దర్శకునిగా విశ్వనాధుడికి నంది అవార్డులు వచ్చాయి. విశ్వనాధుడికి ఉత్తమ దర్శకునిగా ఫిలిం ఫేర్ అవార్డు కూడా వచ్చింది. ఆస్కార్ అవార్డుకి పంపబడింది కానీ ఎంట్రీ రాలేదు. ఇదీ ఘనమే. ఎన్నో ఫిలిం ఫెస్టివల్సులో ప్రదర్శించబడింది.

ఈశ్వర్ అనే టైటిలుతో విశ్వనాధే హిందీలోకి రీమేక్ చేసారు. కన్నడంలోకి రీమేక్ చేయబడిన సినిమాలో సుదీప్ , మీనా నటించారు. తమిళంలోకి డబ్ చేయబడింది. శంకరాభరణం తీయబడిన పట్టిసీమ ప్రాంతంలో, తొర్రేడు, రాజమండ్రి ప్రాంతాలలో షూటింగ్ చేయబడింది. ఇంత అందమైన నిశ్శబ్ద విప్లవ సంగీత భరిత చిత్రాన్ని చూడని తెలుగు ప్రేక్షకుడు మా తరంలో ఉండరేమో ! ఈతరంలో ఎవరయినా ఒకరూ అరా ఉంటే అర్జెంటుగా చూసేయండి. బిపి ఉంటే తగ్గుతుంది. మనసు తెలియని అందాల సంగీత లోకాల్లో విహరిస్తుంది.

**- సుబ్రమణ్యం దోగిపర్తి**

**ఈ సినిమా ఘనవిజయానికి, ఓ శ్రవణకావ్యంగా మిగిలిపోవటానికి కారణం ఇళయరాజా సంగీతం, సి నారాయణరెడ్డి ఆత్రేయ సిరివెన్నెల సీతారామశాస్త్రుల పాటల సృష్టి, బాలసుబ్ర మణ్యం సుశీలమ్మ జానకమ్మ శైలజల తీయటి గాత్రం. రామా కనవేమిరా శ్రీరఘురామ కనవేమిరా హరికథను ఆత్రేయ ఎంత గొప్పగా వ్రాసారు!! సినిమాకు ఆయువుపట్టు కూడా ఈ పాట. సీతారాముల కళ్యాణం, ధనాల్న మంగళసూత్రాన్ని లాగేసుకుని కమల్ హాసన్ రాధిక మెడలో కట్టేసే సన్నివేశాలే సినిమాను మలుపు తిప్పుతాయి. ప్రతీ పాట మధురమే. అయినా ఇళయరాజాకు అవార్డు ఎందుకు రాలేదో ఆశ్చర్యంతో పాటు బాధ కూడా కలుగుతుంది. లాలీ లాలీ లాలీ లాలీ వటపత్ర సాయికి వరహాల లాలీ రాజీవ నేత్రునికి రతనాల లాలీ పాటను నారాయణరెడ్డి గారు ఎంత బాగా వ్రాసారో!! ఆయన వ్రాసిందే మరో సుందర మధుర గీతం మనసు పలికె మౌనగీతం. విశ్వనాథ్ అద్భుతంగా చిత్రీకరించారు.**



## పెద్దకొవ్వాడలో పోలీసులు పల్లెనిద్ర



(సత్యంన్యూస్, రణస్థలం)

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ జి.హరికృష్ణారావు సిబ్బందితో కలిసి పెద్దకొవ్వాడ మత్స్యకార గ్రామంలోని కమ్యూనిటీ అవుట్‌రీచ్‌లో బుధవారం పల్లెనిద్ర చేశారు. స్థానిక మత్స్యకారులతో రాత్రిపూట బస చేశారు. ఈ సందర్భంగా అనుమానిత వ్యక్తులు, తీవ్రవాదులు, దేశ వ్యతిరేక శక్తుల ప్రమాదాలపై వారికి అవగాహన కల్పించడంతో పాటు విశ్వాసం, స్నేహం, జాతీయ సమగ్రతను పెంపొందించారు. అనుమానితులు, గుర్తు తెలియని వ్యక్తులు తారసపడినా, ప్రభుత్వం నిషేధించిన మారక ద్రవ్యాలు తీరం వెంబడి రవాణా అయినా కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ టోల్ ఫ్రీ నెంబర్ 1093కు గాని, కళింగపట్నం ఎస్‌హెచ్ఓ నెంబర్ 93929 14712కు గాని సమాచారం ఇవ్వాలని సూచించారు.

## ఆధ్యాత్మిక సేవలో ఆత్మసంతృప్తి: శంకర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆధ్యాత్మిక సేవ ఆత్మసంతృప్తినిస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బ్యాంకర్స్ కాలనీలో శ్రీశ్రీశ్రీ శివబాలాజీ దేవాలయం 16 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యుల బృందం మహాకుంభాభిషేక మహోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి, సేవలతో తరించాలన్నారు. ప్రతినిత్యం కొంత సమయాన్ని ఆధ్యాత్మిక సేవ, సమాజ సేవలకు వెచ్చించాలని, ఇటువంటి మహత్కార్యంలో పాల్గొనటం ఆనందంగా ఉందన్నారు. మూడు రోజులుగా జరుగుతున్న కార్యక్రమాలకు సహకరించిన భక్తులకు, స్థానికులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆధ్యాత్మిక సేవలో నిమగ్నమయ్యారు. మహా కుంబాభిషేక మహోత్సవంలో ఆలయ కమిటీ బృందం, భక్తులు, ఆధ్యాత్మిక సేవకులు పాల్గొన్నారు.

# డాగ్‌ను గాడ్‌గా మార్చిన ఆలయమది!

కుక్కలకు సంబంధించి సుప్రీంకోర్టు సీరియస్ వ్యాఖ్యలు చేసిన తర్వాత.. దానిపై భిన్నరకాల సామాజిక చర్చలు జరుగుతున్నాయి. ఓ హీరోయిన్ అయితే కుక్కలను కనిపించకుండా చేయాలనడంపై బాహాటంగా ఏడ్చేయడం.. ఆ వీడియో వైరల్ కావడమూ చూశాము. ఇప్పుడసలే చిత్తాకార్తె. ప్రతీ కుక్కకూ ఓ సమయం వస్తుందన్నట్టుగా.. ఈ సీజన్ అంతా కుక్కలదే హవా. ఇలాంటి సమయంలో కుక్కల దాడులు.. వాటిపై వార్తలు.. ప్రభుత్వాల చర్యలు.. స్టెరిలైజేషన్ ఇవన్నీ చూస్తుంటాం. కుక్కపిల్ల, సబ్బుబిళ్ల, అగ్గిపుల్ల ఇలా ఏదీ కవితకనర్హం కాదంటూ శ్రీశ్రీ చెప్పినట్టు.. ఇప్పుడు ఎక్కడ చూసినా కుక్కల ముచ్చట నడుస్తోంది. మరలాంటి కుక్కకూ ఓ టెంపుల్ ఉంది తెలుసా..? డాగ్‌ను తిర్లామర్లా చేసి గాడ్‌గా మార్చిన ఆ ఆలయం గురించి కాస్త తెలుసుకుందామా మరి..!

పరాస్సిని మడప్పుర శ్రీ ముత్తప్పన్ ఆలయమే ఆ టెంపుల్. కేరళలో కుక్కులను పూజించే ఏకైక ఆలయమది. కేరళ అంటే ఎంత ప్రగతిశీల భావాలు కనిపిస్తాయో.. అంతే భక్తిపారవశ్యమూ పొంగిపొర్లుతుంటుంది. అక్కడి ఆలయాలు, వారి ఆచారాలు, వాస్తుశిల్పం, అక్కడ ఆధ్యాత్మికతకు దక్కే ప్రాముఖ్యత అవన్నీ కూడా ఎప్పుడూ ఓ చర్చే. అయితే, అందులో కన్నూర్‌లోని పరాస్సిని మడప్పుర శ్రీ ముత్తప్పన్ ఆలయం మరింత ప్రత్యేక చర్చ. ఎందుకంటే 700 ఏళ్ల పురాతన మందిరమది. పైగా కుక్కలను పవిత్ర దేవతగా కొల్చే దేవాలయమిది. జంతు సంరక్షకులనైనా, ఆధ్యాత్మిక అన్వేషకులనైనా ఒకింత ఆలోచింపజేసే ఓ ఇంట్రెస్టింగ్ టెంపుల్ ఇది.

ఆలయ ప్రధాన దేవతైన శ్రీ ముత్తప్పన్‌ను తిరువప్పనగా పిల్చుకునే మహావిష్ణువు, వెల్లటోంగా అభివర్ణించే శివుడు.. ఇలా ఇద్దరి రూపంగా నమ్ముతారు కేరళవాసులు. స్థానికంగా ఉన్న జానపద కథల ప్రకారం ముత్తప్పన్ ఎప్పుడూ కూడా.. మనం దత్తాత్రేయుడి ఫోటోల్లో చూసినట్టుగా.. కుక్కలతో సహవాసం చేసేవాడట. అలా జంతువులను కూడా దైవిక సహచరులుగా పరిగణనలతో తీసుకోవడానికి ఆయన సహచర్యమే కారణమైందంటారు. మనం ఇళ్లకు ఎలాగైతే కాపలా పెట్టుకుంటుంటామో.. అలాగే, కుక్కలు ఈ ఆలయ ప్రవేశద్వారం వద్ద కాంస్య విగ్రహాలతో కాపలాలా నిలబడి ఉండేలా ఆ ఆలయాన్ని తీర్చిదిద్దారు. అయితే, ఈ ఆలయంలో నైవేద్యం పెట్టే ప్రసాదాన్ని మొదట ఇక్కడ గాడ్‌గా కొల్చే డాగ్‌కు పెట్టాకే.. భక్తులకు వితరణ చేయడం మరో విశేషం. ఇక్కడి ఈ ఆచారం ఉత్తమ స్నేహితుడిలా కుక్కను దగ్గరకు తీసే మన సమాజ విశ్వాసాన్ని ఇక్కడ ప్రతిబింబిస్తుంది.





### నయోట్టు.. ఇదో ఓ ఆచారం!

ఈ ఆలయంలో నయోట్టు అనే ఓ ఆచారముంది. కుక్కలకు రోజూ ఆహారం పెట్టడమే ఈ ఆచారం. ప్రతీ ఉదయం, సాయంత్రాలు కుక్కలకు ఎండిన చేపలు, బీన్స్, ఇతర నైవేద్యాలను వడ్డిస్తారు. చాలా కుక్కలు ఈ ఆలయ సమీపంలో దర్శనమిస్తాయి. స్వేచ్ఛగా ఆలయం బయటా, లోపలా తిరుగుతుంటాయి. ఇక్కడ వీటిని ఎవ్వరూ ఏమనరు. ఎందుకంటే ఇక్కడ ఈ కుక్కలే దేవతలు, దేవతా రక్షకులు, దేవతా దూతలు అన్నీను. ఓ ఏడేళ్ల కుక్క సుందరి, పదిహేనేళ్ల వరకూ బతికిన దాని తల్లి మీను వంటి కుక్కలు ఈ ఆలయంలో వర్కర్స్‌తో మమేకమైన జీవులు. ఇక్కడికొచ్చే భక్తులుగానీ, సందర్శకులుగానీ.. ఏనాడూ కుక్కల దాడులు ఎదుర్కొన్న దాఖలాల్లేవు. దీంతో కుక్కను దైవికమని నమ్మేవారి సంబంధం ఇక్కడ మరింత బలపడింది.

### తెయ్యం ఆచారానికీ ఈ కుక్కల గుడి ఓ స్పాట్!

ఈ ఆలయం.. నృత్యం, నాటకం వంటివాటిని మిళితం చేసే పురాతన కేరళ జానపద ప్రదర్శనైన తెయ్యం ఆచారానికీ ప్రసిద్ధి చెందింది. పరస్సిని మడప్పురలో కాలానుగుణంగా ఉండే ఇతర ఆలయాల మాదిరిగా కాకుండా.. ఈ ఆచారాన్ని ప్రతీరోజూ నిర్వహిస్తుంటారు. వన్నన్ సామాజికవర్గ సభ్యులు గంటల తరబడి జపాలు చేయడం, పవిత్రమైన శిరస్త్రాణం ధరించి దేవతల్లా రూపాంతరం చెందడం.. కల్లు, చేపలు, బ్లాక్ బీన్స్, ఛాయ్ వంటివాటిని నైవేద్యాలుగా తయారుచేయడం.. భక్తులకు ఆ ప్రసాదాల వితరణ చేయడం ఇలాంటి ఆచారాలన్నీ ఈ ఆలయంలో కనిపిస్తాయి. ఈ ఆచారాలు ముత్తప్పన్ సంప్రదాయ హిందూ ఆచారాలకు భిన్నంగా ఉంటాయి. అందుకే, ఇక్కడ సమర్పించే నైవేద్యాలూ అలా భిన్నంగానే కనిపిస్తాయి.

### ఎందుకు ఈ ఆలయం అంత ప్రత్యేకం..?


పరస్సిని మడప్పుర శ్రీ ముత్తప్పన్ ఆలయం ఓ ఆధ్యాత్మిక కేంద్రంగానే కాదు.. మానవులు, పెంపుడు జంతువుల మధ్య సహజీవనానికి ఓ చిహ్నం కూడాను. అందుకే ఇక్కడికి తమ పెంపుడు జంతువులను ఆశీర్వాదం కోసం చాలామంది యజమానులు తీసుకురావడం ఓ ఆనవాయితీ. ఈ ఆలయంలో కుక్కల పూజ, తెయ్యం ప్రదర్శనలు, భిన్నమైన నైవేద్యాల కూర్పు.. ఇలా ఇవన్నీ కేరళతో పాటే, ప్రపంచంలోనే మరే ఇతర ఆలయంలో కనిపించనంత భిన్నంగా ఉంటాయి. అందుకే ఈ ఆలయం ప్రత్యేకం.

### సందర్శించాల్సిన సమయం!

ఈ ఆలయాన్ని ఎక్కువగా డిసెంబర్‌లో పంటకాలాన్ని సూచించే పుత్తరి తిరువప్పన పండుగ సమయంలో ఎక్కువ మంది సందర్శిస్తుంటారు. కన్నూరు నుంచి 21 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంటుంది. కన్నూరు నుంచి బస్సులు, ట్యాక్సీల్లో వెళ్లవచ్చు. జంతువులను ప్రేమించేవారికి.. కొత్త విశేషాలను తెలుసుకోవాలనుకునే వారికి ఓ డిఫరెంట్ ఎక్స్‌పీరియెన్స్ ఈ టెంపుల్.

బాతాఖానీ సౌజన్యంతో..

# ఏడిస్తే పోయేదేమీ లేదు.. గుండె బరువు తప్ప!




- 'ఏడ్పు జీవలక్షణమట.. ఏడ్వకున్న కొట్టి ఏడ్పింతురట బిడ్డ పుట్టగానె.. ఎంత ఇష్టమొ నరజాతి కేడుపన్న? అతని ఏడ్పున కసలైన యర్థమేమొ?' - ఆత్రేయ పద్యం తెలుగునాట మనసున్న ప్రతివారినీ ఆత్రేయ ఏడిపిస్తూనే ఉంటారు.
- గుండె పగిలిపోవు వరకు మనచేత ఏడిపిస్తాడు. గుండె ముక్కలయినా.. ఆ ముక్కలు కూడా విడివిడిగా లెక్కలేని రూపాలుగా ఏడవాలంటాడు. గుండె ఏడ్చి ఏడ్చి కన్నీరు మున్నీరై పొంగిపోవాలంటాడు. తలచుకుని తలచుకుని ఏడవాలంటాడు. ఏమీ తోచక ఏడవాలంటాడు. ఉన్నది పోయినందుకు ఏడవాలంటాడు. లేనిది కోరి, దొరకక ఏడవాలంటాడు. మనసిచ్చి ఏడవాలంటాడు. మనసు శూన్యమై ఏడవాలంటాడు. మనసున్న మనిషికి సుఖముండదు కాబట్టి ఏడుస్తూనే ఉండాలని తీర్మానించాడు. ఏడుపులో ఆనందాన్ని వెతుక్కుని ఏడ్చి ఏడ్చి మొహం కడుక్కోమన్నాడు.


ఆత్రేయ రచనలు అర్థమై రెండు తరాలు ఏడుస్తూనే ఉన్నాయి. ఇప్పుడు అందరూ ఆత్రేయను చంపి పుట్టినవారే కాబట్టి అర్థం కాక.. లేక ఎక్కడ అర్థమవుతుందోనని భయపడి ఏడుస్తూ ఉంటాం. అది వేరే విషయం. ఏడుపు జీవ లక్షణమని ఆత్రేయ సిద్ధాంతీకరించారు. బిడ్డ పుట్టగానే ఏడవకపోతే కొట్టి ఏడిపిస్తారని చెప్పారు. అక్కడి నుంచి అడుగడుగునా బతుకంతా ఏడుపే. మనుషులకు ఏడుపంటే చాలా ఇష్టమని ఆత్రేయ తేల్చేశారు. 'ఏ కన్నీళ్ల యెనకాల ఏముందో తెలుసుకో!' అని కూడా ఆత్రేయే అన్నారు.

'బాలానాం రోదనం బలం' పిల్లలకు ఏడుపే బలం అని శాస్త్రీయంగా నిరూపణ అయిన సిద్ధాంతమే ఉంది. 'నాకూ అందరిలా ఆశున్నాది.. మనసున్నాది.. నలుగురిలా కలలు కనే కళ్లున్నాయి.. అవి కలత పడితే కన్నీళ్లున్నాయి..' అని మూగమనసుల్లో జమున వెక్కి వెక్కి ఏడ్చింది. 'కాటుక కంటినీరు చనుకట్టుపై పడ ఏల ఏడ్చెదవో?' అని మన పోతన ఏడ్చే సరస్వతీ దేవినే ఓదారుస్తూ పద్యం చెప్పాడు. 'నన్ను కదిలించబోకు.. నా కళ్లలో అశ్రు జంఝామారుత్తులు గలవు..' అని కనురెప్పల మాటున దాగిన కన్నీటి సంద్రాలను దాశరథి గాలిబ్ గీతాల్లో దర్శించాడు. 'కలకంఠి కంట కన్నీరొలికిన సిరి ఇంటనుండ నొల్లదు..' అని ఇంట్లో మహిళ ఏడిస్తే లక్ష్మీదేవి ఉండదన్నాడు సుమతీ శతకకారుడు.

'ఏడ్చే మగవాడిని నమ్మరాదని' తెలుగు సామెత ఏకకాలంలో మహిళలను, మగవారిని ఇద్దరినీ అవమానించింది. మహిళలు ఏడుపుకు బ్రాండ్ అంబాసిడర్లు అనడం ఎంత తప్పో! మగవారు ఏడవకూడదనడం కూడా అంతే తప్పు!

ఇవన్నీ ఏడుపు గురించి సరయిన అవగాహన లేని రోజుల్లో జరిగిన విషయాలు. పుట్టిన మాటలు. ఏర్పడ్డ భావనలు. హార్వర్డ్ విశ్వ విద్యాలయం అధికారికంగా ప్రకటించిన సమాచారం ప్రకారం..





1. ఏడుపు నవ్వు కన్నా చాలా మంచిది. మానసిక ఆరోగ్యానికి అవసరం.
2. ఎలా ఏడవాలో తెలియక, ఏడిస్తే అవమానం అనుకుని ఏడవలేక అనారోగ్యం పాలవుతున్నాం.
3. గుండెల్లో బాధ తగ్గాలంటే ఏడ్చి మొహం కడుక్కుంటే సరి.
4. కల్మషం లేని, వెలితి లేని, చివరి కన్నీటి బొట్టు వరకు రాల్చగలిగిన ఏడుపులు కరువవుతున్న నేపథ్యంలో ప్రొఫెషనల్‌గా ఏడుపును నేర్పడానికి కంపెనీలు పుట్టుకొచ్చాయి.

హార్వర్డ్ ఏడుపును పరిగణనలోకి తీసుకుంటే..

ఇప్పుడు ఏడుపొక కొత్త కన్నీటి మార్కెట్. కార్పొరేట్ కంపెనీల కన్ను జనం ఏడుపు మీద పడింది. ఇక మన ఏడుపేదో మనం ఏడవడానికి వీల్లేకుండా.. ఎలా ఏడవాలో కూడా మార్కెట్టే నియంత్రిస్తుంది. కన్నీళ్ల కోల్డ్ స్టోరేజ్ ప్లాంట్లు, కన్నీటి డిపాజిట్ల బ్యాంకులు, అద్దెకు కన్నీళ్ల బాటిల్స్, న్యాప్కిన్స్.. గుండెలు బాదుకునే కిరాయి విద్యలు ఇక ఏడుపు మార్కెట్లో బజ్ వర్డ్స్.

ఏడుస్తూ, ముక్కు చీదుతూ ఉండగా హెచ్‌డి, 4కె, 8కె క్లారిటీతో కలకాలం గుర్తుంచుకోదగ్గ ఫోటోలు, వీడియోలు తీయడం మరో కొత్త కొనసాగింపు ఏడుపు వ్యాపారం. 'ఓ మై క్రయ్', 'ఇట్స్ మై బ్యూటిఫుల్ క్రయ్' లాంటి హ్యాష్‌ట్యాగ్స్‌తో ఎవరి ఏడుపును వారు మరచిపోకుండా సెల్ఫీలు తీసుకుని.. పదే పదే చూసుకుంటూ కుమిలి కుమిలి ఏడుస్తూ ఉండడమే జాతీయ స్థూల ఆరోగ్య సూచీ అవుతుందేమో! అంతర్జాతీయ యోగా దినోత్సవంలా.. అంతర్జాతీయ ఏడుపు వారోత్సవాలు కూడా వస్తాయేమో!

ఇక ఎవరి ఏడుపు వారికి ముద్దు కావాలి. ఎవరి ఏడుపు వారి ఇష్టం, సొంతం కావాలి. ఏడ్చి మొహం కడుక్కోవడానికి బహిరంగ ప్రదేశాల్లో ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలి. కరువుదీరా ఏడవడానికి పబ్లిక్ పార్కులు కావాలి. జాతీయ స్థూల ఏడుపు సూచీని ఆరోగ్య శాఖ ఎప్పటికప్పుడు ప్రకటించాలి. నవ్వు నాలుగు విధాలా చేటు- ఏడుపే అయిదు విధాలా మేలు! (ఇది పాత ఏడుపే!)

పమిడికాల్వ మధుసూదన్
















# ఏపీసీ చెలగాటం.. ఎమ్మెల్యేకు ఇరకాటం!

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాక్షేత్రంలో ఉండే ఎమ్మెల్యేలను నిత్యం ప్రజలు గమనిస్తుంటారు. నిజంగా ఆర్‌జేడీ విచారణ జరిపి ఉంటే.. కలెక్టర్ ఈ వ్యవహారంపై మళ్లీ విచారణకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను ఎందుకు నియమిస్తారనే దానికి ఏపీసీ సమాధానం చెప్పాల్సి ఉంటుంది. కూన రవికుమార్ పొందూరు ప్రిన్సిపాల్‌పై లేఖ ఇచ్చారు సరే.. మరి కంచిలి ప్రిన్సిపాల్‌ను కదిపేయమని, గార ప్రిన్సిపాల్‌ను పొందూరు వేయమని ఎవరు లేఖ ఇచ్చారంటూ స్వయంగా డీటీఎఫ్ నాయకుడు పేడాడ కృష్ణారావు ప్రశ్నించడం చూస్తే కూన రవికుమార్ లేఖ మాటున మరో ఇద్దరికి స్థాన చలనం కలిగించడం వెనుక ఏపీసీ ఏదో ఒక ప్రయోజనం పొంది ఉంటారని అర్థమవుతోంది.

### కూన రవి లేఖ ఇచ్చారన్నది సాకే!

రాష్ట్రంలో ఎక్కడా లేనన్ని కేజీబీవీలు శ్రీకాకుళం జిల్లాలో ఉన్నాయి. బాలికల చదువు మాటెలా ఉన్నా.. అధికారులకు, అక్కడ పని చేస్తున్న సిబ్బందికి సంపద సృష్టించే కేంద్రాలివి. అందుకే లక్షలాది రూపాయలు ఖర్చుచేసి మరీ అర్హత లేనివారు జిల్లా ఏపీసీగా వస్తుంటారు. ప్రతి కేజీబీవీలోనూ నిధుల దుర్వినియోగం, కొనుగోళ్లలో మతలబులు ఉంటాయి. తిలా పాపం.. తలా పిడికెడు మాదిరిగా వాటిలో వాటాలు ఏపీసీ వరకు చేరుతుంటాయి. దీనికి ఎవరూ అతీతులు కాదు. అందుకే ఆరోపణలు ఒక్కరికే పరిమితం కాదు. దాదాపు అందరు కేజీబీవీ ప్రిన్సిపాళ్ల పరిస్థితి అలాగే ఉంటుంది. అయితే ఏపీసీ కార్యాలయానికి కూడా వాటాలిస్తుండటం వల్ల వీరిపై చర్యలకు ఉపక్రమించరు. అలాగని ఫిర్యాదులు లేవా అంటే.. ప్రతి కేజీబీవీ మీద కట్టలకొద్దీ ఆరోపణలున్నాయి. ఇప్పుడు రవికుమార్ ఫిర్యాదు నెపంతో సౌమ్యను బదిలీ చేయాల్సివచ్చింది. ఆర్‌జేడీ విచారణలో కూడా కూన రవికుమార్ లేఖ మేరకే బదిలీ చేశామని ఏపీసీ చెప్పుకొచ్చినట్టు భోగట్టా.

### సోషల్ మీడియాలో కులాల కుమ్ములాట

అసలు ఆరోపణలేంటి? ఎవరు విచారణ జరిపారు? అన్న విషయాలపై ఇంత గొడవ జరుగుతున్నా కూడా ఏపీసీ నోరు విప్పలేదు. దీంతో ఇది కులాల మధ్య చిచ్చుగా మారింది. ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిన దగ్గరనుంచి జిల్లాల్లో రెండు ప్రధాన సామాజికవర్గాలు సామాజిక మాధ్యమాల వేదికగా ఎడతెరిపిలేని యుద్ధం చేస్తున్నాయి. వీటిని బయటవారు గుర్తించలేకపోవచ్చుగానీ పార్టీ అధిష్టానం మాత్రం ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటోంది. ఎమ్మెల్యే, ఏపీసీ ఒకే సామాజికవర్గానికి చెందిన వారు కావడంతో దళిత సంఘాలు దీన్ని ఆ కోణంలోనే చూస్తున్నాయి. సమగ్రశిక్ష ప్రాజెక్టుకు జిల్లా విద్యాశాఖ అధికారి జిల్లా కో ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుంటారు. ఆ తర్వాతే అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉంటారు. అలాంటప్పుడు సౌమ్యపై వచ్చిన ఆరోపణలను సమగ్రశిక్ష ఎస్‌పీడీ, జిల్లా విద్యాశాఖాధికారి దృష్టిలో పెట్టిన తర్వాత ఎంక్వైరీ నివేదికను జతపర్చి బదిలీకి సిఫార్సు చేస్తూ కలెక్టర్‌కు ఫైల్ పెట్టాలి. ఇవేవీ చేయకుండానే కూన రవిని ఏపీసీ తప్పుదోవ పట్టించారు. ఎమ్మెల్యే రవికుమార్ పొందూరు ప్రిన్సిపాల్‌ను మానసికంగా, శారీరకంగా వేధించారా? లేదా? అన్న కోణం పక్కన పెడితే.. ఆమె బదిలీపై మీడియా ముందుకు రావాల్సిన ఏపీసీ ఇది కేవలం కూన రవి, సౌమ్యల మధ్య గొడవగానే వదిలేశారు. వాస్తవానికి యూనియన్లు మొదటి రోజు ఏపీసీ మీద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సమగ్రశిక్ష కార్యాలయం ముందు నిరసన చేపట్టాయి. కానీ మరుసటి రోజు నుంచి ఈ కథను కూన రవి చుట్టూనే తిప్పి చంద్రబాబు వరకు తీసుకువెళ్లాయి. కూన రవిపై వచ్చిన ఆరోపణలను జిల్లాలో సాటి ఎమ్మెల్యేలెవరూ ఖండించకపోగా.. ఏపీసీ అనాలోచిత చర్యలు సౌమ్యకు మద్దతు పెరగడానికి దోహదపడ్డాయి. ఇప్పుడిది చినికి చినికి గాలివానగా మారింది. ప్రతిపక్షం దీన్ని ఒడిసిపట్టుకుంది.

**అధికార పక్షంలో కూన వ్యతిరేకులు ఏం చేస్తున్నారేది మరో శీర్షికలో తెలుసుకుందాం.**

సెలవు రోజుల్లో బదిలీ ఉత్తర్వులు ఇవ్వడం, ఎంక్వైరీ చేయకుండానే పూర్తయిందని రవికుమార్‌కు సమాచారం ఇవ్వడం, ఎస్‌పీడీ, కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించడం వంటివి చూస్తుంటే కచ్చితంగా ఎవరో.. ఎవరితోనో చేతులు కలిపినట్లు అర్థమవుతుంది. ఇది ఏంటనేది మరో కథనంలో తెలుసుకుందాం.

# మీతో ఉన్న మహిళలు ఎవరో మీరు చెబుతారా.. నన్ను చెప్పమంటారా?

- ప్రశ్నించే వారిని బెదిరించడం కూనకు అలవాటే
- వైకాపా సమన్వయకర్త చింతాడ రవికుమార్




(సత్యంన్యూస్, ఆమదాలవలస)

పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్‌ను మానసికంగా, శారీరకంగా వేధించినట్టు వచ్చిన ఆరోపణలపై స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ తనకు తాను సచ్చీలుడినని చెప్పుకుంటున్నారని, అదే నిజమైతే ఒంటిమిట్టలో సతీసమేతంగా స్వామివారిని దర్శించుకున్నట్టు ఒక పత్రికలో వచ్చిన వార్తపై ఏం సమాధానం చెబుతారని వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ ప్రశ్నించారు. కేవలం ఆ మహిళ ఐడెంటిటీని బయటపెట్టకూడదని, ఆమెకు కూడా ఒక కుటుంబం ఉంటుంది కాబట్టి ఆమె ముఖాన్ని బ్లర్ చేస్తున్నట్టు పేర్కొంటున్నట్టు మీడియాకు ఆ క్లిప్పింగ్‌ను బుధవారం సాయంత్రం రిలీజ్ చేశారు. అలాగే ఓ ఒంటరి మహిళ భుజంపై చెయ్యి వేస్తూ ఫొటోకు దిగారని, ఆమెతో ఎక్కడికి వెళ్లారో కూన రవికుమార్ చెబుతారా, లేదా తనను చెప్పమంటారా అని రవి సవాల్ విసిరారు. తనపై అనేక ఆరోపణలు చేసిన కూన రవికుమార్ ఇప్పుడు పొందూరు కేజీబీవీ ప్రిన్సిపాల్‌పై కూడా ఆధారాలు లేని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సౌమ్య చేసిన ఆరోపణలకు ఆధారాలు కావాలని అడుగుతున్నారని, ఆయన కార్యాలయంలో జరిగిన తతంగానికి ఆధారాలు ఆయనే ఇవ్వాలని చింతాడ రవి ఎదురుప్రశ్న వేశారు. సీసీ టీవీ ఫుటేజ్‌లు కూన రవి ఇస్తే అన్నీ బయటపడతాయన్నారు. పరాయి మహిళలతో దేవాలయాల్లో దర్శనాలకు వెళ్తున్న కూన రవి ప్రివిలైజ్ కమిటీ ముందు అందర్నీ నిలబెడతాననడం ఎవరికి ప్రివిలైజో చెప్పాలని కోరారు. సౌమ్య విషయంలో అడ్డంగా బుక్కై టీడీపీ అధిష్టానంతో చీవాట్లు తిన్న కూన ఫ్రస్టేషన్లో ఏదేదో మాట్లాడుతున్నారని, కూన తనను తాను దేవుళ్లతో పోల్చుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కుల పరిధిని ఎమ్మెల్యే కూన దాటి వ్యవహరిస్తున్నారని తప్పుబట్టారు. ఎమ్మెల్యే రవి అక్రమాలపై ప్రశ్నించిన వారిని బెదిరించడం, సోషల్ మీడియాలో ట్రోల్ చేయించడం అలవాటేనని చింతాడ ఆరోపించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్, జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, మున్సిపల్ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, సరుబుజ్జిలి అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, బూర్జ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, పొందూరు అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, పార్టీ నాయకులు బొడ్డేపల్లి రాజు, కూన రామకృష్ణ, మామిడి రమేష్, నున్నగాపుల చిన్నారావు పాల్గొన్నారు.

# వారంతా నా అక్కచెల్లెళ్లు

- సౌమ్య వివాదాన్ని రాజకీయం చేస్తున్నారు
- అన్ని కులాల్లోనూ అభిమానులున్నారు
- ఎమ్మెల్యే కూన రవికుమార్



(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

తనతో పాటు ఒంటిమిట్ట రామాలయానికి వచ్చిన మహిళ గాని, తన పక్కన ఫొటో దిగిన మరో మహిళ గాని తనకు అక్కచెల్లెళ్లని, అమరావతి వచ్చిన పార్టీ కేడర్‌తో దేవాలయాలకు వెళ్లినప్పుడు కలిసే పూజలు చేశామని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పేర్కొన్నారు. వైకాపా ఆమదాలవలస ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ బుధవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చేసిన ఆరోపణలకు గురువారం ఉదయం కూన రవికుమార్ జిల్లా పార్టీ కార్యాలయంలో కౌంటరిచ్చారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య వివాదాన్ని వైకాపా నాయకులు రాజకీయానికి ముడిపెట్టి దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ప్రిన్సిపాల్ సౌమ్యది నాటకమని ప్రజలందరికి తెలిసిందన్నారు. తనను టార్గెట్‌గా చేసుకొని ఇంతవరకు ఫేక్ ప్రచారానికి కారణమైన కొందరు మరో అడుగు ముందుకేసి తన వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేలు దగ్గరికి ఎంతోమంది స్నేహితులు, సన్నిహితులు, కార్యకర్తలు దేవాలయం దర్శనం కోసం లెటర్స్ కోసం వస్తారన్నారు. పార్టీకి చెందిన మహిళా నాయకులు, కార్యకర్తలు తనతో పాటు దర్శనానికి వస్తామన్న సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. ఇకనుంచి ప్రతీ ఫొటో చింతాడ రవికి పంపిస్తానని కూన పేర్కొన్నారు. చంద్రబాబు పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన కార్యకర్తగా మహిళలను ఎలా గౌరవించాలో, ఎలా ప్రవర్తించాలో తెలిసిన వ్యక్తినన్నారు. నేరచరిత్ర కలిగిన వ్యక్తి అధినేతగా ఉన్న వైకాపా నాయకులు మహిళల పట్ల ఎలా వ్యవహరిస్తారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. చింతాడ రవి చూపించిన ఫొటోలో ఒకామె ఆమదాలవలస నియోజకవర్గంలోని ఒక గ్రామానికి సర్పంచ్ అని తెలిపారు. ఆ ఫోటోలను మీడియాకు చూపించి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వైకాపా ఇన్‌ఛార్జిగా ఉన్న చింతాడ రవికుమార్ లాంటి వ్యక్తులు ఉన్న ఆ పార్టీలోని మహిళల పరిస్థితి ఏమిటో గుర్తు చేసుకోవాలన్నారు. కుటుంబ సంబంధాలు తెలియని వ్యక్తులు వైకాపాలో ఉన్నారని దుయ్యబట్టారు. వైకాపా నేతలతో దేవాలయాలకు వెళ్లిన మహిళల్ని కూడా ఇలానే రోడ్డుకీడుస్తారా అని కూన ప్రశ్నించారు. చింతాడ రవి వార్డు మెంబర్ స్థాయి కంటే తక్కువని ఎద్దేవా చేశారు. తనకు కులాలకు అతీతంగా అభిమానులున్నారని కూన రవి అన్నారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, సింతు సుధాకర్, ముద్దాడ కృష్ణమూర్తినాయుడు, పీఎంజే బాబు, మాదారపు వెంకటేష్, తమ్మినేని గీత, విభూది సూరిబాబు, గుత్తు చిన్నారావు, టీడీపీ మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

# ప్రతీ రైతుని ఆదుకుంటాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రైతే దేశానికి వెన్నుముకని, ప్రతీ రైతుని ఆదుకుంటామని, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం రూరల్, గార మండల నదీ ప్రవాహాలను గురువారం ఎమ్యెల్యే సుడిగాలి పర్యటన చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ గడిచిన రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటపొలాలు అతలాకుతలం అయ్యాయని, నష్టపోయిన ప్రతీ రైతుకు, నష్ట పరిహారం అందేవిధంగా చూస్తానని హామీనిచ్చారు. ప్రభావిత పరిసర ప్రాంతాలను సందర్శించానని, వంశధార, నాగావళి జలాల గట్టులు, ఆక్రమణకు గురైన పరిసరాలను పునరుద్ధరిస్తామన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి అందరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు. భారీ వర్షాలకు రైతులు కష్టపడుతున్న తీరు వర్ణించలేమని, రానున్న రోజులలో ఇటువంటి విగాధలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. ఈ సుడిగాలి పర్యటనలో వంశధార ప్రాజెక్టు చైర్మన్ అరవల రవీంద్ర, రూరల్ అధికారులు, మండల, గ్రామస్థాయి నీటిపారుదల అధికారులు, రైతన్నలు, స్థానికులు, టీడీపీ నగర, మండల అధ్యక్ష బృందం తదితరులు పాల్గొన్నారు.



# ఆన్‌లైన్‌లో డిగ్రీ ప్రవేశాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



2025-26 విద్యాసంవత్సరానికి రాష్ట్రంలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయని ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి) శ్రీకాకుళం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు తెలిపారు. ఇంటర్ పాస్ అయిన విద్యార్థినులు వెబ్ కౌన్సిలింగ్‌లో పాల్గొని కోర్సులు ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ మహిళా కళాశాలలో B.A., B.Com., B.Sc. లాంటి మేజర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, గ్రంథాలయం, హాస్టల్, కంప్యూటర్ ల్యాబ్, స్కాలర్‌షిప్ సౌకర్యాలు కూడా ఉన్నాయని ఆయన వివరించారు. ఓసీ అభ్యర్థులు రూ.400లు, బీసీ అభ్యర్థులు రూ.300లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు రూ.200లను నెట్‌బ్యాంకింగ్ ద్వారా https://oamdc.ucanapply.comలో చెల్లించవచ్చన్నారు. అడ్మిషన్‌కు ఈనెల 26వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చని, వెబ్ ఎంపికలు: 24 నుండి 28 వరకు ఉంటాయని తెలిపారు. అదేవిదంగా 31న సీట్ల కేటాయింపు జరుగుతుందని, సెప్టెంబర్ ఒకటి నుండి తరగతులు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు సమయానికి నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

# వైభవంగా మహా కుంభాభిషేకం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక బ్యాంకర్స్ కాలనీలో కొలువుతీరిన శివబాలాజీ దేవేరుల మహా కుంభాభిషేక వేడుకలు వైభవంగా జరిగాయి. వేదపండితులు, శ్రీకూర్మక్షేత్ర అర్చకులు చామర్తి వేంకట కృష్ణమాచార్యులు, శ్రీవిద్యోపాసకులు, స్మార్తాగమ పండితులు శృంగారం లక్ష్మీధనుంజయ శర్మ పర్యవేక్షణలో యజ్ఞయాగాది క్రతువులు జరిగాయి. ముగింపు వేడుకల్లో భాగంగా ఏకోత్తర సహస్ర కలశ స్నపన పూర్వక మహా కుంభాభిషేకం అత్యంత వైభవంగా సాగింది. వేద పండితులు, మంగళ వాయిద్యాల మధ్య భక్తులు కళ్యాణ వేంకటేశ్వరస్వామిని, ఉమా సమేత అమరనాథేశ్వర స్వామిని పవిత్ర పుణ్యజల కళాశాలతో దర్శించుకుని ఆలయ శిఖరాలపై అభిషేకించడంలో భక్తులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ తులసీరామ్, ఎం.సామంతో మాట్లాడుతూ ఈ మహా ఉత్సవాన్ని జయప్రదం చేయడంలో సహకరించిన దాతలకు, పండితులకు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి, ఆర్‌వీఎన్ శర్మ, కె.రమేష్, సూర్యనారాయణ రెడ్డి, ఎన్.కైలాష్‌రావు, కే.ప్రసాదరావు, సీహెచ్ దుర్గారావు, ఎం.రామకృష్ణ, కె.సత్యనారాయణ, రాంబాబు రెడ్డి, పట్టాభి రామారావు, ఎన్.కృష్ణమూర్తి, కలకవలస ప్రసాదరావు తదితర నిర్వాహకులను భక్తులు అభినందించారు.

### శివబాలాజీ సేవల్లో ప్రముఖులు

శివ-బాలాజీ ఆలయ ఆధ్వర్యంలో గురువారం జరిగిన మహా కుంభాభిషేకం మహోత్సవంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, ధనుంజయరావు, డాక్టర్ అమ్మన్నాయుడు, అంధవరపు సంతోష్, డాక్టర్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



## ఫైరింగ్ ప్రాక్టీస్ ఉంది.. అప్రమత్తంగా ఉండండి

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

చిన్నరావుపల్లి గ్రామం వద్ద ఉన్న పోలీస్ ఫైరింగ్ గ్రౌండ్‌లో శుక్రవారం జిల్లా పోలీసులు ఫైరింగ్ ప్రాక్టీస్ చేయనున్నట్లు రిజర్వ్ ఇన్స్పెక్టర్ శంకర్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి పరిసర ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ఈ ఫైరింగ్ రేంజ్‌కు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

# వ్యవసాయ యంత్ర కాంట్రాక్టుల్లో అక్రమాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రైతు ప్రయోజనాల కోసం ఉద్దేశించిన వ్యవసాయ యంత్ర పరికరాల కాంట్రాక్టుల్లో అవకతవకలు చోటుచేసుకోవడంపై మాజీ ఉప ముఖ్యమంత్రి, వైకాపా జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. ఆగ్రోస్ జీఎం రాజమోహన్ ప్రభుత్వానికి రాసిన లేఖతో ఈ వ్యవహారం బయటపడిందన్నారు. గురువారం శ్రీకాకుళం జిల్లా పార్టీ కార్యాలయంలో కృష్ణదాస్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు అందాల్సిన యంత్రపరికరాల పథకాన్ని కూడా కాంట్రాక్టుల ముసుగులో అవినీతికి వాడుకోవడం బాధాకరమన్నారు. నిజాయితీ గల అధికారిని ఒత్తిడులు తట్టుకోలేక సెలవుపై వెళ్లే పరిస్థితి రావడం ఆందోళనకరమని ధర్మాన వ్యాఖ్యానించారు. ఆగ్రోస్ ఆధ్వర్యంలో జరుగుతున్న యంత్రపరికరాల పంపిణీ ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ఈ ఆరోపణలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రైతాంగం తీవ్రమైన ఇబ్బందుల్లో ఉందని వారిని పట్టించుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో టెక్కలి, ఆమదాలవలస వైకాపా నియోజకవర్గ సమన్వయకర్తలు పేరాడ తిలక్, చింతాడ రవికుమార్, పార్టీ ముఖ్య నాయకులు అంధవరపు సూరిబాబు, గొండు కృష్ణమూర్తి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షులు మెంటాడ స్వరూప్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్ని ధనుంజయ్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు రౌతు శంకరరావు, జిల్లా ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ఎంఏ బేగ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దుంప లక్ష్మణరావు, మెండ శాస్త్రి గద్దిబోయిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# పాలకొండ రెవెన్యూ డివిజన్‌ను శ్రీకాకుళం జిల్లాలో కలపాలి

(సత్యంన్యూస్, పాలకొండ)

పాలకొండ రెవెన్యూ డివిజన్‌ను ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని, లేకుంటే శ్రీకాకుళం జిల్లాలో విలీనం చేయాలని పాలకొండ జిల్లా సాధన సమితి జిల్లా అధ్యక్షుడు బుడితి అప్పలనాయుడు కోరారు. ఈమేరకు గురువారం సబ్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వం జరిపిన అస్తవ్యస్త జిల్లాల విభజన వలన పాలకొండ డివిజన్ ప్రజలు అనేక కష్టనష్టాలు పడుతున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ తప్పులు సరి చేసేందుకు మంత్రివర్గం ఉపసంఘంను నియమించడం హర్షదాయకమన్నారు. ఈ ప్రాంతాన్ని జిల్లా చేస్తే ఇటు వ్యవసాయదారులకు, బడుగు బలహీన వర్గాలకు, పీడిత తాడిత ప్రజానీకానికి ఉపయుప్తంగా ఉంటుందన్నారు. అలా సాధ్యం కాకపోతే శ్రీకాకుళం జిల్లాలో పాలకొండను కలపాలని కోరారు. కార్యక్రమంలో కాణిపాక చౌదరి నాయుడు, వండాన కూర్మారావు, సబ్బ నానాజీ, శిల్లా బ్రహ్మాజీ, లోకనాథం చౌదరి, పాలవలస రామినాయుడు, డాక్టర్ గణపతి, ఆనాపు శంకర్‌రావు, కొట్నాన అప్పన్న, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం అధ్యక్షులు బెహరా బంగారి, సిపిఐ మండల కార్యదర్శి ద్వారపూడి అప్పలనాయుడు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు వాగులపల్లి రమణమూర్తి, కౌలు రైతుల సంఘం అధ్యక్షులు కిమిడి రామ్మూర్తి, పిట్ట రమణలు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.